క్లుప్తంగా

శ్రమదానంతో పంట కాలువకు మరమ్మతులు

రౌతులపూడి: గ్రామ శివారున రాళ్లకట్టు కాలువకు శనివారం రైతులు శ్రమదానం చేసి మరమ్మతులు చేపట్టారు. సుమారు 150 ఎకరాలకు పైగా ఆయకట్టు భూములకు ఈ కట్టు ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. కాగా రాళ్లకట్టు పూర్తిగా శిథిలమవ్వటంతో ఎగువ ప్రాంతంలోని ఏటి కాలువ ద్వారా వచ్చే నీరు వృథాగా పోతోంది. ఆయుకట్టు శివారు ప్రాంతంలో రైతుల భూములకు నీరు అందడం లేదు. దీంతో సాగుకు దూరం కావాల్సి వస్తోందని రైతులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు ఏకమై శ్రమదానంతో కాలువ మరమ్మతులు చేపట్టారు. లోబీడు కట్టుకాలువ నుంచి వృథాగా పోతున్న నీరుకు అడ్డుకట్టు వేసేందుకు ఇసుక మూటలు వేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలమైన రాళ్లకట్టు, లోబీడు కట్టుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఏలేశ్వరం సొసైటీ మాజీ అధ్యక్షుడు సామంతుల వెంకటేశ్వరరావు, సామంతుల దొరయ్యబాబు జ్ఞాపకార్థం ఎంపీపీ మెయిన్ పాఠశాల, రవీంద్ర కాన్వెంట్‌ల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడికి సత్కారం

ఏలేశ్వరం: మండల పెన్షనర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ హెచ్‌ఎం ఉద్దగిరి సోమరాజును పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడుగా సేవలు అందించిన సోమరాజు 95వ వసంతంలోని అడుగు పెట్టడంతో పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెన్షనర్స్ సంఘ నాయకులు ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎయిర్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులను అన్నదానం చేశారు.

పంట నష్టపరిహారం మంజూరు

తుని రూరల్: మండలంలో 142 మంది రైతులకు పంట నష్టపరిహారం మంజూరైనట్టు మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ శనివారం తెలిపారు. 2022–23 ఖరీఫ్ సీజన్‌లో సంభవించిన వరదలకు మండలంలో 142 మంది రైతులు పంటలను నష్టపోయారన్నారు. వీరికి రూ.40 లక్షల నష్ట పరిహారం మంజూరైందని, ఈ నెల 8న రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందని ఏఓ వివరించారు.

ఘనంగా డాక్టర్స్ డే

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం డాక్టర్స్ డే నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు శైలజ, చిన్నారావు, సౌమ్య, బాలతేజ, రఘుపతి, రమేష్, సురేష్, షబానాలను ఘనంగా సన్మానించారు. ప్రపంచంలో వైద్యవృత్తిని మించిన వృత్తి లేదని, ప్రాణాలు కాపాడే వైద్యులకు సంఘంలో ప్రత్యేకస్థానం ఉందని కొనియాడరు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పూర రాజబాబు, జ్యోతుల శ్రీనివాస్, కోట కల్యాణ చక్రవర్తి, ఆదిమూలం కనక విజయ్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు శిక్షణ తరగతులు

ప్రత్తిపాడు రూరల్: చేనేత కార్మికుల సామాజిక, ఆర్థిక జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా వారికి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ సాహూ తెలిపారు. మండలంలోని ఒమ్మంగిలో శనివారం చేనేత కార్మికులకు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 మంది చేనేత కార్మికులకు ఫ్రేమ్ వీలింగ్‌లో 45 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్మికులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ చేనేత, జౌళి శాఖ డీఓ గంగరాజు, వీవర్స్ సొసైటీ చైర్మన్ గిడుతూరి శ్రీరాములు, మాజీ చైర్మన్ పలివెల రామ్, కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

గోకవరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. మండలంలోని కామరాజుపేటలో సీసీ రోడ్డు, శ్మశానవాటికలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శనివారం వారు శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఇటీవల ఆయా సమస్యలను ఎంపీపీ సుంకర శ్రీవల్లి దృష్టికి తీసుకువెళ్లగా రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.2 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాల మేరకు మండల పరిషత్ నిధులు కేటాయించినట్టు తెలిపారు.

‘సురక్ష’తో అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇందుగపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో అట్టహాసంగా జగనన్న సురక్ష ప్రారంభం

కోటనందూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఇందుగపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ న్యాయం చేయడానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సర్పంచ్ కుంచే సత్యవతి, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, సర్పంచ్ సుర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో దోపిడీ పాలన

తొండంగి: జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ పాలన అందించిన నీచ చరిత్ర చంద్రబాబుది అని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు పింఛన్ల సొమ్మును సైతం జన్మభూమి కమిటీల ద్వారా దోపిడీ చేశారన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. గ్రామంలోని పేద వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగ పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ ఎంపీపీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి నాగం గంగబాబు, మండల ప్రత్యేకాధికారి ప్రవీణ, ఎంపీడీఓ పసపులేటి సతీష్, తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు గాబు రాజు, మేరుగు ఆనందహరి, పార్టీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సర్టిఫికెట్లు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లు అందిస్తున్నట్టు ఎంపీపీ పర్వత రాజబాబు తెలిపారు. మండలంలోని నెల్లిపూడి సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ నరాల శ్రీలతా తాతబ్బాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో పేదలకు మేలు



శృంగవరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని శృంగవరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. శృంగవరం సచివాలయం పరిధిలో 311 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్వీఎస్.సుబ్బలక్ష్మి, తహసీల్దార్ బి.భీమారావు, ప్రత్తిపాడు ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైస్ ఎంపీపీ సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ ఏసుబాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ మేలు

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు పలు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రత్యేకాధికారి వరప్రసాద్, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ చిన్నారావు, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచాలి

జగ్గంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ప్రతిష్ట మరింత పెరిగేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట సచివాలయం–1లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో కుల, ఆదాయ, మరణ తదితర సర్టిఫికెట్లు అందని వారిని గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం పలువులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లను అందజేశారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సుధారాణి, జగ్గంపేట మండల స్పెషల్ ఆఫీసర్ పి.సత్యప్రసాద్, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, ఉభయగోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్ వెస్లీ, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగనన్న సురక్షతో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని భూపాలపట్నంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అరబోలు వాసు, బేరి బాబ్జి, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, దోమాల గంగాధర్, చదలవాడ బాబీ, తోట గాంధీ, పెంటకోట నాగబాబు, భూపాలపట్నం ప్రసాద్ పాల్గొన్నారు.

గోకవరం: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మల్లవరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 2013 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ పాల్గొన్నారు.



గండేపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రభుత్వ బడి.. సౌకర్యాల ఒడి

- విద్యా వ్యవస్థలో సమూల మార్పులు
- స్కూల్స్ తెరిచిన రోజే విద్యాకానుక అందజేత
- 4,522 మంది విద్యార్థులకు అమ్మఒడి అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యాకానుక కిట్ అందిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు



సుందరంగా తీర్చిదిద్దిన కోటనందూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల

కోటనందూరు: పేద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన ఉన్నత విద్యాప్రమాణాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపడమే బాధ్యతగా తీసుకుంటే చాలు..మిగిలిన సౌకర్యాలన్నీ ప్రభుత్వమే చూసుకుంటోంది. విద్యార్థి వేసుకునే యూనిఫాం, షూ, బెల్ట్, అచ్చు, నోటు పుస్తకాలు అన్నీ ఉచితంగా అందిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందిస్తున్నారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ఆహ్లాదక వాతావరణంలో ఉన్నతస్థాయి విద్యా ప్రమాణాలను అందిస్తున్నారు.

ఆంగ్ల మాధ్యమంలోనే బోధన



విశాలమైన తరగతి గదుల్లో ఫ్యాన్ల కింద కొత్త బెంచీలపై కూర్చొని పాఠాలు వింటున్నాం. ఉపాధ్యాయులు పూర్తిగా ఇంగ్లిషు మీడియంలోనే బోధిస్తున్నారు. అచ్చు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఇచ్చేశారు. మంచినీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. మా పాఠశాలలో వాతావరణం చాలా బాగుంది.
– షణ్ముఖ్, విద్యార్థి, కోటనందూరు హైస్కూల్

నాణ్యమైన భోజనం పెడుతున్నారు



హైస్కూల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా అన్ని రకాల కూరగాయలతో పాటు చిక్కి, రాగి జావ ఇస్తున్నారు. సీఎం జగన్ పిల్లల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పౌష్టికాహారం అందించడం సంతోషం. బడిలో భోజనం చేయడానికి మా పాప ఇష్టపడుతుంది.
– పసగడుగుల లక్ష్మి, విద్యార్థిని తల్లి, పాతకొట్టాం

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



పాఠశాల నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతిరోజూ మరుగుదొడ్లు, పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించి ఆహ్లాదక వాతావరణాన్ని సృష్టిస్తున్నాం. నిరంతర పర్యవేక్షణతో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాం. – పీవీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం, భీమవరపుకోట హైస్కూల్

సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు



మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా మారుతున్నాయి. నాడు–నేడు తొలి విడతలో రూ.20 కోట్లతో సగం పాఠశాలలను అభివృద్ధి చేయగా రెండో విడతలో మరో 20 కోట్లతో మిగిలిన పాఠశాలల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.
– ఏవీఎస్ శ్రీనివాస్, ఎంఈఓ, కోటనందూరు.

కోటనందూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	32
విద్యార్థులు	3,502
అందించిన అచ్చుపుస్తకాలు	30,500
అందించిన నోటు పుస్తకాలు	19,112
అందించిన విద్యాకానుక కిట్లు	3,500
ప్రైవేటు పాఠశాలలు	10
విద్యార్థులు	1,150
అమ్మఒడి పొందిన విద్యార్థులు	4,522
అమ్మఒడి ద్వారా పొందిన లబ్ధి	రూ.6.78 కోట్లు
మనబడి నాడు–నేడు నిధులు	రూ.40 కోట్లు
అభివృద్ధి చేసిన పాఠశాలలు	30

మండలంలో 3,502 మంది విద్యార్థులు

కోటనందూరు మండలంలో 32 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 3,502 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 3,500 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లతో పాటు 30,500 అచ్చు పుస్తకాలు, 19,112 (6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు) నోటు పుస్తకాలు అందజేసింది. మండలంలో 10 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 1,150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాది అమ్మఒడి పథకం ద్వారా 4,522 మంది విద్యార్థులకు రూ. 6.78 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

రుచికరంగా గోరుముద్ద

గతంలో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు తినేవారు కాదు. అన్నం, సాంబారు, కూరల్లో పురుగులుండేవి. చాలా మంది విద్యార్థులు ఆ భోజనాన్ని ఇష్టపడక సగానికి పైగా విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయేవారు. సీఎం జగన్ గోరుముద్ద పేరుతో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



పాతకొట్టాంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


కోటనందూరు: మండలంలోని పాతకొట్టాంలో డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్య సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

తుని: స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గొల్లప్పారావు సెంటర్ వరకూ డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ చేశారు. ఆరోగ్య సిబ్బంది డెంగీ వ్యాధి వ్యాప్తికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గోకవరం: విద్యార్థులు డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు సూచించారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో శనివారం డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు పి.రవికుమార్, పి.భారతి, ఇతర ఆరోగ్య సిబ్బంది ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్.అన్నవరంలో మంత్రి రాజాకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తుని: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను ఆపేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీఓను ఉపసంహరించాలని, పెండింగులో ఉన్న క్లెయిములను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి రాజా సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు షేక్ పద్మ, నక్కెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

శంఖవరం: తమ సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

దుంగలు తొలగించండి

గండేపల్లి: జాతీయ రహదారిని ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న దుంగలను తొలగించాలని హైవే మెయింటెనెన్స్ ఐఎమ్‌టీ మేనేజర్ సుబ్బారావు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తాళ్లూరు శివారులో సామిల్లు వద్దకు కోత నిమిత్తం తీసుకువచ్చిన కర్ర దుంగలను రోడ్డుకు సమీపంలో వేశారు. వీటి వల్ల హైవేపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో విధి నిర్వహణలో ఉన్న హైవే మెయింటెనెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని దుంగలను తొలగించాలని సామిల్లు నిర్వాహకులకు సూచించారు. వారు స్పందించకపోవడంతో హైవే మెయింటెనెన్స్ ఐఎమ్‌టీ ఇన్‌చార్జ్ ధన, రోడ్డు మెయింటెనెన్స్ సిబ్బంది దుంగలు చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

గండేపల్లి: సారా కాస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రఘునాథపురానికి చెందిన అబ్బిరెడ్డి రమేష్, నీలపాల ప్రసాద్ గండేపల్లి శివారులో సారా కాస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి నుంచి పది లీటర్ల సారా, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- లింగంపర్తిలో గడపగడపకూ మనప్రభుత్వం



లింగంపర్తిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: రాష్ట్రం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, రాజాచౌదరి, వడ్డి శ్రీవాస్తవ పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు.